

కృష్ణానగర్ నుంచి వెంకటగిరి వెళ్లే దారిలో కుడివైపు నాలాకు ఏర్పాటు చేసిన ఇనుప జాలి



ప్రైవేట్ స్కూల్‌కి వెనక వైపు ఉన్న నాలా



జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్.2 నుంచి వచ్చే వరద పోయే నాలాకు ఏర్పాటు చేసిన జాలి

నాలాను మింగేశారు..

- ఆక్రమణతోనే వరదముంపు సమస్య
- పదేళ్లుగా తీయని పూడికతీత
- లే అవుట్ ప్రకారం నాలాను పునర్ వ్యవస్థీకరించాలి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): 1978కి ముందు ఏర్పడ్డ వెంకటగిరి, కృష్ణానగర్ బస్తీలు వ్యవసాయ భూములు. పచ్చని పంట పొలాల మధ్య కాల్వలు ఉండేవి. నాటి పంట కాల్వలే నేటి వాననీటి నాలాలుగా రూపాతరం చెందాయి. నాడు ఎంత వాన వచ్చినా వరద సాఫీగా వెళ్లే నీటి నాలాను కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేట్టారు. నాడు జనాభా తక్కువ, మట్టి రోడ్లు ఉండేవి. నేడు పెరిగిన జనాభా, ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లు కనిపిస్తున్నాయి. తిలాపాకం తలా పిడికెడు అన్నచందంగా వెంకటగిరి, కృష్ణానగర్ బీ, సీ బ్లాక్‌ల మధ్య ఉన్న నాలా పరిస్థితి ఉంది. నాటి నుంచి నేటి వరకు రాజకీయ నాయకుల అండతో కృష్ణానగర్, వెంకటగిరి వాననీటి నాలాను అనకొండల కొంత మంది మింగేశారు. అధికారంలో ఎవరున్నా.. అధికారులు ఎవరొచ్చినా.. డబ్బు అనే భూతంతో కట్టి పడేసి నాలాపై ఆక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణాలతో వానాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద కృష్ణానగర్ బీ, సీ బ్లాక్‌లకు, వెంకటగిరి వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వానాకాలం వస్తే ఈ బస్తీల ప్రజలు ఆందోళనతో బతుకుతున్నారు.



నాలాలో పూడిక తీస్తున్న యంత్రం



కృష్ణానగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ ఎదుట నాలా



వెంకటగిరి కమ్యూనిటీ హాల్ వెనక నాలా

ముందు ఇల్లు వెనక నాలా..

వెంకటగిరి చౌరస్తాలో రోడ్డుకు ముందు గణపతి మండపం వెనక నాలా మధ్యలో ఇల్లు వద్ద సమస్య ఆరంభమైంది. ఇదే నాలా రానురాను ఎవరికి వీలైనంత వారు మింగేవారు. కృష్ణానగర్ అమ్మవారి ఆలయం వైపు, రిలాక్స్ వైన్స్‌షాపు పక్కన ప్రధాన రహదారి మెట్రో పిల్లర్ నెంబర్ .1537 వద్ద ఉన్న నాలా దిగువలో ఉంది. యూసుఫ్‌గూడ నుంచి ఇందిరానగర్ గడ్డకు వెళ్లే మార్గంలోని మెట్రో పిల్లర్ నెంబర్.1537 వద్ద నాలాను ఆక్రమించి ఇల్లు నిర్మించారు. వెంకటగిరి చౌరస్తా నాలా, కృష్ణానగర్ ప్రాంతాల్లో మూసుకుపోయిన నాలాను క్లియర్ చేస్తే వరద ముంపు సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు చెబుతున్నారు.

నాలాను మింగి ఇనప జాలి పెట్టి..

జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్.2, హైలం కాలనీ, గాయత్రి నగర్ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు కృష్ణానగర్ నాలాలో కలుస్తాయి. రోడ్డునెంబర్.2 వైపు నుంచి వచ్చే వాననీళ్ల పోయే నాలాకు ఒకవైపు అపార్ట్‌మెంట్, మరోవైపు ఇళ్ల నిర్మించడంతో నాలా కుచించుకుపోయింది. బయట నాలా పై గోడ నిర్మించి మధ్యలో రంధ్రం ఉంచి ఆ రంధ్రానికి ఇనుప జాలిని అమర్చారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు ఇనప జాలికి చెత్త, ప్లాస్టిక్ డబ్బాలు, థర్మకోల్ అట్టపెట్టెలు అడ్డం పడి వాననీటిని పోకుండా అడ్డుపడడంతో వరదనీరు పోటెత్తి అపార్ట్‌మెంట్ సెల్లార్, ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఆగస్టులో కురిసిన వర్షాలకు ఈ వరద ప్రవాహానికి ఓ అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలింది.

పదేళ్లుగా పూడిక తీయలేదు..

వెంకటగిరి, కృష్ణానగర్ నాలాలో పదేళ్లుగా పూడిక తీయలేదు. నాలాలో ఇసుక, చెత్త వ్యర్థాలు చేరిపోయి వరద పోకుండా అడ్డుపడుతున్నాయి. ఎండాకాలంలో చేపట్టాల్సిన నాలా పూడికతీత పనులు చేయకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. యంత్రాన్ని ఉపయోగించి పూడిక తీయాలి.



వెంకటగిరి నాలాను వైనక వైపు నుంచి పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్(ఫైల్)

పూడిక తీయడానికి మనుషులు మాత్రమే వెళ్లేలా ఉన్న నాలాలో సుమారుగా నాలుగు అడుగులకు పైగా పూడిక పేరుకపోయి ఉంది. వెంకటగిరి గణేశ్ మండపం వెనక ఉన్న నాలాలో సుమారుగా 30 ట్రిప్పులకు పైగా పూడిక తీశారు. నాలాలో భారీగా పూడిక పేరుకపోవడంతో వాననీరు రోడ్లపై ప్రవహిస్తూ వాహనాలు కొట్టుకుపోయేలా చేస్తున్నాయి.

హైడ్రా పరిశీలనలో ఉంది



కృష్ణానగర్ నాలా ఆక్రమణ హైడ్రా కమిషనర్ పరిశీలనలో ఉంది. కొంతమంది నాలా ఆక్రమణదారులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానికులం ఫిర్యాదు చేశాం. కొంతమంది కోసం ప్రజలంతా ఇబ్బందులు పడలేం. నాలాలు కలుస్తున్న జంక్షన్‌లో పెద్ద మ్యాన్‌హోల్(మౌత్ పీస్) నిర్మించాలి.

లక్ష్మీరెడ్డి, స్థానికురాలు

తక్షణమే పూడిక తీయాలి



కృష్ణానగర్ నాలాలో పేరుకపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలి. నాలాలో వ్యర్థాలను తొలగించే విధంగా, పారిశుద్ధ్య కార్మికులు వెళ్లడానికి వీలుగా నాలా పై ప్రీ కాస్ట్ బిల్లలు వేయాలి. డ్రైనేజీ మురుగు రోడ్లపై ప్రవహించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

సత్యనారాయణ, స్థానికుడు

వరద ఎక్కువ.. నాలా తక్కువ

కృష్ణానగర్ నాలాకు ఎగువ ప్రాంతాలైన జూబ్లీ హిల్స్ హైలం కాలనీ, గాయత్రి హిల్స్‌తో పాటు ఐదు ప్రాంతాల నాలాలు నుంచి వచ్చే వాన వరద ఎక్కువగా ఉంటుంది. కృష్ణానగర్ ప్రధాన రహదారికి వచ్చే వరికి నాలా పరిమాణం తక్కువగా ఉంది.

జయలక్ష్మి, స్థానికురాలు



రాజీవ్‌నగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న మాగంటి సునీత



కృష్ణానగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్



మార్నింగ్ వాకింగ్‌లో భాగంగా ఎర్రగడ్డలోని అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమైన జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత, వాత్సల్యనాథ్, దిశిర తదితరులు

నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

- బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత



ఫాతిమా నగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, బీఆర్ఎస్ నాయకులు

ఎర్రగడ్డ/యూసుఫ్‌గూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు పూర్తయ్యే వరకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాలని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత పిలుపునిచ్చారు. శనివారం ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్ నగర్ కాలనీలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రాజీవ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు పీఎస్‌జీ కృష్ణశర్మ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, నాయకులు కంజర్ల పల్లవిమహేందర్ యాదవ్, కళ్యాణి, దాసి శ్రీకాంత్ పాల్గొన్నారు. కృష్ణానగర్‌లో కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ పటేల్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ దాస్, సంతోష్, ఆదిలక్ష్మి, కైసర్ జాన్, బసవరాజు, రేణుక పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్

ఎర్రగడ్డలోని వాసవి బృందావనం, సీటాడెల్ బ్రిగేడ్, జనప్రియ, కల్పతరువు, లక్ష్మీకాంప్లెక్స్ తదితర అపార్ట్‌మెంట్ వాసులతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత మార్నింగ్ వాక్‌లో భాగంగా సమావేశమయ్యారు. దివంగత నేత మాగంటి గోపీనాథ్ కుమారుడు వాత్సల్యనాథ్, కుమార్తె దిశిర కూడా ఈ సమావేశానికి హాజరై అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలను తమవిగా భావించి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసాఇచ్చారు. ఎర్రగడ్డలోని ఫాతిమానగర్‌లో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, నాయకులు శ్రీహరి, కళ్యాణి, సయ్యద్ రసూల్ పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యుల సమావేశం

- హాజరుకానున్న కేటీఆర్, హరీశ్‌రావు

బోరబండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో బీఆర్ఎస్ నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించనున్నారు. దీనికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు హాజరుకానున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ నామినేషన్ దాఖలు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, బూత్ కమిటీల ప్రతినిధులతో ఆయా డివిజన్ల ఇన్‌చార్జీల పరిచయం వంటి సమన్వయ కార్యక్రమాలు కొనసాగుతాయని ఎమ్మెల్సీ టి.రవీందర్‌రావు తెలిపారు.



సమావేశం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీలు రవీందర్ రావు, శ్రీనివాసరెడ్డి

మద్యం కొనుగోలు చేస్తున్నారా..

కేసులు పొంచి ఉన్నాయి జాగ్రత్త

బంజారాహిల్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు అంటేనే కార్యకర్తలకు మందు మంచింగ్‌కు కక్కా, ముక్కా ఉండి తీరాల్సిందే. ఇందుకోసం వైన్స్ షాపుల వద్ద మద్యం కొనుగోలు చేస్తున్న వారు పోలీసుల నిబంధనలను తెలుసుకోకపోతే చిక్కుల్లో పడ్డట్టే. అబ్కారీ నిబంధనల ప్రకారం ఒక్క వ్యక్తి 7.8 లీటర్ల బీరు, 4.5 లీటర్ల మద్యం కొనుగోలు చేయాలి. ఇది మించితే ఎక్సైజ్ పాలసీ కింద కేసులు నమోదు చేయడంతోపాటు కొనుగోలు చేసిన మందు సీసాలు సీజ్ చేస్తారు. ఈ నిబంధనను పోలీసులు పెద్దగా పట్టించుకోరు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో పోలీసులు మఫ్టీలో మద్యం దుకాణాల వద్ద కాపు కాస్తున్నారు. అధిక మొత్తంలో మద్యం కొనుగోలు చేస్తున్న వారిపై కేసులు పెడుతున్నారు. గడిచిన మూడు రోజుల్లో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో సుమారు పది కేసులు నమోదయ్యాయి. ఈ నిబంధన గురించి తెలియక హుషారుగా వైన్‌షాప్‌కు వస్తున్న మందుబాబులు పోలీసుల కేసులతో బెంబేలెత్తుతున్నారు. లెక్కకు మంచి ఇంట్లో మద్యం బాటిళ్ల పెట్టుకున్నా నేరమేనట.!



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా రాజీవ్ నగర్ కూడలిలో వాహనాలను తనిఖీ చేస్తున్న బోరబండ పోలీసులు
- బోరబండ, ఆంధ్రజ్యోతి

ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్



బంజారానగర్‌లో ప్రచారం చేస్తున్న నవీన్ యాదవ్



ప్రచారం చేస్తున్న ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్

ఎర్రగడ్డ/యూసుఫ్‌గూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ కోరారు. శనివారం ఎర్రగడ్డ డివిజన్‌లోని బంజారానగర్, బీ శంకర్ లాల్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్‌ను కలిసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శశికుమార్, ఎస్.బాబునాయక్, యాదగిరి యాదవ్ పాల్గొన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనర్సింహనగర్‌లో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ ప్రచారం చేశారు. నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్ దాస్, రాజేష్ యాదవ్, లతీఫ్, హనీఫ్ ఉర్ రెహమాన్, భాను, సాయిభాస్కర్, రాజేష్ పాల్గొన్నారు.

రాజ్ నగర్‌లో వెలుగుతున్న వీధిదీపాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖైరతాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా వెలగని వీధి దీపాలు.. రాజ్‌నగర్‌లో అంధకారం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యుత్ విభాగం ఈఈ వెంటనే స్పందించి సంబంధిత అధికాలకు వెంటనే మరమ్మతు పనులు చేయించాలని సూచించారు. దీంతో సిబ్బంది శనివారం రాజ్‌నగర్‌లో వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేశారు. అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న పరికరాలను పంపామని, మరికొన్నిచోట్ల ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని వీధిదీపాల విభాగం డీఈ తెలిపారు. దీంతో 'ఆంధ్రజ్యోతి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



వీధిదీపానికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఉత్సాహంగా ముగిసిన ఉడాన్ స్పోర్ట్స్

బంజారాహిల్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉడాన్ స్పోర్ట్స్ పేరిట బంజారాహిల్స్ రోడ్డునెంబర్.7లోని మెరీడియన్ స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఉడాన్ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఐటీ శాఖ కమిషనర్ షానవాజ్ ఉల్ రెహమాన్ హాజరై విద్యార్థులకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓడిపోయామని విద్యార్థులు ఎప్పుడూ కుంగిపోవద్దని, విజయం కోసం ప్రయత్నించాలని సూచించారు. నగరంలోని 24 పాఠశాలలకు చెందిన 200 మందికిపైగా విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ పూనం జా తెలిపారు. చెస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నట్లు స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్ తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత

బంజారాహిల్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకంగా ప్రచురించబోయే మున్నూరు కాపు డైరెక్టరీ, డైరీ ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద విద్యార్థులకు ఖర్చు చేస్తామని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, డైరీ కమిటీ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ తెలిపారు. శనివారం శ్రీనగర్ కాలనీలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది లవంగాల అనిల్ కుమార్, ఈసంపల్లి వెంకటేశ్వర్లు, ఆకుల సతీష్, చాట్ల నర్సింగరావు, పర్వతం సతీష్, పొన్న వెంకటరమణ, కోట్ల వినోద్ పాల్గొన్నారు.

రాష్ట్ర, జిల్లా స్థాయిలలో వినియోగదారుల రక్షణ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

పంజాగుట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా స్థాయిలలో వినియోగదారుల రక్షణ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ వినియోగదారుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరు ప్రసన్న కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తీక్‌రాజుతో కలిసి కమిటీ రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని చట్టాలు ఉన్నా నేటికీ వినియోగదారులు మోసపోతూనే ఉన్నారన్నారు. తమకు జరిగిన మోసం, అన్యాయం గురించి ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారులకు వారి హక్కుల గురించి తెలుపడమే కాకుండా, మోసపోయిన సందర్భంలో న్యాయంగా రావాల్సిన పరిహారం ఇప్పించే ప్రయత్నం చేస్తామని అన్నారు. త్వరలోనే అన్ని జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.ప్రశాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆదిత్యవర్ధన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌రాజ్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు లాఫ్టర్ యోగా జాతీయ సదస్సు

పంజాగుట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): లాఫ్టర్ యోగా సొసైటీ క్లబ్ ఆధ్వర్యంలో ఏబీసీ లాఫింగ్ క్లబ్, యోగా క్లబ్స్ తెలంగాణ సహకారంతో ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో లాఫ్టర్ యోగాపై నేడు జాతీయ సదస్సు జరగనుంది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏబీసీ లాఫింగ్ క్లబ్, యోగా క్లబ్స్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ ఏవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, సలహాదారు శ్యామ్‌కుమార్, కోశాధికారి విజయ్ కుమార్ జాతీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ్వుతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. లాఫింగ్ యోగా వల్ల ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు తమ అనుభవాలను వివరించారు. ఈ సదస్సులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు ఆర్.రఘురామ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఏబీసీ లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ లాఫ్టర్ యోగా గురువు డాక్టర్ మదన్ కటారియా, పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో 67 లాఫింగ్ క్లబ్స్ ఉండగా, నగరంలో 27 లాఫింగ్, యోగా క్లబ్‌లు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ క్లబ్ అధ్యక్షుడు సుధీర్, లాఫింగ్ గురు రవి, తదితరులు పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో ఆత్మహత్య


యూసుఫ్‌గూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిహెచ్.శోభన్ బాబు డెలివరీ బాయ్. ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం రాత్రి భార్య మార్కెట్‌కు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వాళ్లను పిలిచి ఆమె ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఉపేంద్ర శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరు అదృశ్యం


యూసుఫ్‌గూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వేర్వేరు కారణాలతో అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ బస్తీకి చెందిన మహిళ ఈనెల 8న బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లాలి. డాక్టర్ అపాయింట్‌మెంట్ ఉందని భర్తతో చెప్పింది. భర్త సంస్థలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని వెంట పంపించాడు. ఆస్పత్రిలో డాక్టర్ లేరని చెప్పి వెంట వచ్చిన ఉద్యోగిని తిరిగి ఆఫీస్‌కు పంపించింది. ఆమె ఇంటికి రాలేదు. దీంతో భర్త శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తల్లి మందలించిందని బాలిక..

పదోతరగతి బాలిక చదువులో వెనకబడిందని తల్లి మందలించడంతో గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అదే రోజు సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి ఖమ్మం వెళ్తున్నట్లు చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. దీంతో బాలిక తల్లి సంధ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.



హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన ప్రెస్టో ఇండియా



అమెరికా లాంటి దేశాల్లో వినియోగించే డ్రైక్లీనింగ్, లాండ్రీతో పాటు-షూ & బ్యాగ్ కేర్, టైలరింగ్ వంటి పలు విభాగాల్లో వినియోగదారుల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌లో ప్రెస్టో సంస్థ ఆధునిక సేవలతో ముందుకు వచ్చింది. ప్రెస్టో మేనేజింగ్ డైరెక్టర్, య్వో మెట్జిలార్ హాజరై.. ప్రెస్టో కస్టమర్ సంతృప్తి కోసం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, సాఫ్ట్ వాష్ టెక్నాలజీ ద్వారా దుస్తులకు నష్టం లేకుండా శుభ్రపరిచే సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రెస్టో సేవల విస్తరణతో నగర వాసులకు సౌకర్యావంతమైన క్లీనింగ్ సొల్యూషన్ లభించనున్నాయని పేర్కొన్నారు. అలాగే త్వరలోనే పలు నగరాల్లో కూడా ప్రెస్టో సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ADVERTISEMENT

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364


కేంద్ర మాజీమంత్రి పీసీ జోషిని సత్కరిస్తున్న శ్రీగణేశ్

కేంద్ర మాజీమంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే

సికింద్రాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నూతన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఎంపికలో భాగంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని నియామకం కోసం ఏఐసీసీ పరిశీలకులుగా నగరానికి విచ్చేసిన కేంద్ర మాజీమంత్రి, రాజస్థాన్ అసెంబ్లీ మాజీ స్పీకర్ సీపీ జోషి, టీపీసీసీ పరిశీలకులు, నారాయణపేట్ శాసనసభ్యుడు చిట్టెం పర్ణికారెడ్డిలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు ఎన్.శ్రీగణేష్ శనివారం స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు సమావేశమయ్యారు.


బొద్దనగర్‌లో ఏసీపీ శశాంక్‌రెడ్డిని కలిసిన సికింద్రాబాద్ ముదిరాజ్ సంక్షేమ సంఘం నాయకులు

నేడు నామాలగుండులో అలయ్ బలయ్

బౌద్ధనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు బీఎన్ఆర్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం సికింద్రాబాద్ ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్‌ల అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సంక్షేమ సంఘం ఫౌండర్ చైర్మన్ పి.సంజీవి ముదిరాజ్, అధ్యక్షుడు అమ్మగారి యాదగిరి ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో సభ్యులు శనివారం మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటల రాజేందర్, సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్, చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డిలను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సతీష్‌రాజ్, సభ్యులు గౌరీ గణేశ్, విజయ్‌కుమార్, రాంబాబు, వడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాలను అందజేస్తున్న పులి కల్పన

డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలి : పులి కల్పన

అడ్డగుట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలో సొంత ఇళ్లు లేని గృహ కార్మికులకు డబుల్ బెడ్ రూంలు ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ప్రభుత్వానికి డిమాండు చేశారు. శనివారం అడ్డగుట్ట డివిజన్ మొండిబండ బస్తీలో పర్యటించి మహిళల సమస్యల్ని అడిగి తెలుసుకుని, గుడిసెవాసులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత ఇళ్లు లేక గృహ కార్మిక కుటుంబాలు వరదలు వచ్చిన సమయంలో ప్రతిసారి నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ మండల నాయకురాలు బన్నమ్మరూత్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

బౌద్ధనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గౌతమ్‌రావును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్ గౌడ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గౌతమ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కారించారు. బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్, జాయింట్ కన్వీనర్ దత్తు, జయంత్ పాల్గొన్నారు.

ఘనంగా జయప్రకాష్ నారాయణ జయంతి

తార్నాక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సోషలిస్ట్ ఉద్యమ నాయకుడు జయప్రకాష్ నారాయణ ఉద్యమస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి యాదవ్ అన్నారు. జయప్రకాష్ నారాయణ జయంతిని పురస్కరించుకుని శనివారం తార్నాకలోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రొ. సింహాద్రి, నాయకులు, కార్యకర్తలు జయప్రకాష్ నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ సంపూర్ణ విప్లవ ఉద్యమంతో భారత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సామాజిక వర్గాల భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం సాధ్యమని, జయప్రకాష్ నారాయణ ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక పరివర్తన కోసం సమాజ్‌వాది పార్టీ కృషి చేస్తుందన్నారు.

విచార్‌మంచ్ బీసీ సెల్ అధ్యక్షుడి నియామకం

మారేడుపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ విచార్ మంచ్ తెలంగాణ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడిగా మారేడుపల్లికి చెందిన బొట్టు ప్రభాకర్ నియమితులయ్యారు. నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు రఘుమారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు శనివారం మారేడుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించిన రాహుల్ గాంధీ, రాష్ట్ర రాహుల్ గాంధీ విచార్ మంచ్ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను నిర్వహించటానికి కృషి చేస్తానని, ప్రతి జిల్లా, మండలాల్లో జిల్లా, మండల కమిటీలను నియమించి విచార్‌మంచ్ విభాగాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి చర్యలు చేపడతానని పేర్కొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో రోగి అదృశ్యం


శ్రీనివాసులు (ఫైల్)

బౌద్ధనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతతో బాధపడుతూ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన డి.శ్రీనివాసులు(48) ప్రైవేట్ ఉద్యోగి. కొన్నిరోజులుగా మానసిక రుగ్మతతో బాధపడుతున్న అతడిని స్థానిక ఆస్పత్రిలో చూపించగా అక్కడి వైద్యుల సలహా మేరకు 9వ తేదీన గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చి చేర్పించారు. 10వ తేదీ సాయంత్రం 5.30 సమయంలో ఆస్పత్రిలో సిలైన్ ఎక్కించుకుంటున్న సూదిని తీసి అతడు అక్కడ నుంచి అదృశ్యమయ్యాడు. భార్య మమత ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేదు. దీంతో తన భర్త కనిపించటంలేదని భార్య శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనగా అతడు అక్కడికక్కడే మరణించిన ఘటన చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి రైల్ ఓవర్ బ్రిడ్జి కింద జనగామ జిల్లా జఫర్‌గఢ్ ప్రాంతానికి చెందిన మండల రాజు(55)శనివారం రైలు పట్టాలు దాటుతుండగా సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ వైపు వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి జేబులో లభించిన సెల్ నంబరు ఆధారంగా మృతుడు మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసిందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

పట్టించుకోని జీహెచ్ఎంసీ యంత్రాంగం ● అవస్థలు పడుతున్న ప్రజానీకం

సికింద్రాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గుంతలమయమైన రోడ్లతో నెలల తరబడి ప్రజలు అవస్థలు పడుతున్నా జీహెచ్ఎంసీ అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులు అధ్వానంగా మారుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బోనాల జాతరకు మరమ్మతులు చేస్తామని, వినాయక చవితి ఉత్సవాలకు ప్యాచ్ వర్క్స్ చేస్తామని మరోసారి, వర్షాలు తగ్గుముఖం పట్టగానే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని కాలయాపన చేస్తున్నారంటూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. కాగా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి, ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రజా ప్రతినిధులు చేష్టలుడిగి చూస్తుండడం గమనార్హం. సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్- సంగీత్ జంక్షన్ మధ్య (సరోజినీ దేవి రోడ్డు)లో హోటళ్లు, ఆస్పత్రులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు ఉన్నాయి. దాంతో పాటు బేగంపేట్-మారేడుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా ఉన్న రహదారి కూడా కావడంతో నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. వేలాది వాహనాలు రాకసాగిస్తుంటాయి. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడి నెలలు గడుస్తోంది. దాంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నడిరోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా కొన్ని పాయంట్లలో సగం రోడ్డునే వినియోగించవలసి వస్తోంది. దాంతో వాహనాలు దాదాపు ఎదురెదురు తలపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దాంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం వెంటాడుతోంది. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ అధికార యంత్రాంగం స్పందించడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి.


క్లాక్‌టవర్-సంగీత్ జంక్షన్ మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

ఆరు నెలలుగా ఈ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నా అధికారులకు చీమ కుట్టినట్టుగా కూడా లేదని పలువురు మండిపడుతున్నారు. బోనాల జాతర, గణేష్ చవితి ఉత్సవాల సందర్భంగా రోడ్లకు మరమ్మతులు చేస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారని, అయితే కొన్ని చోట్ల నామమాత్రంగా రోడ్లకు పైపైన ప్యాచ్‌వర్క్స్ చేసి చేతులు దులుపుకున్నారని పలువురు పేర్కొంటున్నారు. దాంతో ఆ రోడ్లన్నీ మళ్లీ మామూలు స్థితికి చేరుకున్నాయని చెబుతున్నారు. కాగా ఈ రోడ్డులో ప్యాచ్‌వర్క్ కూడా చేయలేదని, సికింద్రాబాద్ నడిబొడ్డున ఈ దుస్థితి ఉంటే, ఇక అంతర్గత రోడ్ల సంగతేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించే కంటే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడడం మంచిది కదా. సరోజినీదేవి రోడ్డులోని అధ్వాన గుంతల వల్ల ప్రస్తుతం నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రమాదాలు పొంచి ఉన్నాయని తెలిసినా తప్పని పరిస్థితిలో రాకపోకలు సాగించవలసి వస్తోంది. జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి, మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నాం.

- వీరేష్, రెజిమెంటల్‌బజార్

జీహెచ్ఎంసీ దృష్టికి తీసుకువెళ్లాం



సరోజినీదేవి రోడ్డులోని క్లాక్‌టవర్-సంగీత్ జంక్షన్ మధ్యలో ఉన్న గుంతలతోపాటు ఇతరచోట్ల ఏర్పడిన గుంతల గురించి చాలామంది మా దృష్టికి కూడా తీసుకువచ్చారు. వీటివల్ల ట్రాఫిక్ సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో మేము జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి ఈ సమస్యలు తీసుకువెళ్లాం. దాంతో వారు సానుకూలంగా స్పందించి, కొన్ని చోట్ల గుంతలను పూడ్చివేస్తున్నారు. ఈ ప్రాంతంలో గుంతలను త్వరలోనే పూడ్చివేస్తారని ఆశిస్తున్నాం.

- రవికుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, గోపాలపురం

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

● డీసీపీ రష్మి పెరుమాళ్

అడ్డగుట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకుని బాణా సంచా దుకాణదారులు పోలీసుల నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమళ్ సూచించారు. శనివారం నార్త్‌జోన్ కార్యాలయంలో బాణసంచా దుకాణదారుల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ దీపావళి సందర్భంగా బహిరంగ ప్రదేశంలో ఏర్పాటు చేసే టపాసుల దుకాణాల యజమానులు నిబంధనలు పాటించాలని,వెంటనే దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలని కోరారు. జీహెచ్ఎంసీ విద్యుత్ అధికారుల నుంచి పర్మిషన్‌తో పాటు పోలీసుల నుంచి లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు.


బాణసంచా దుకాణాల యజమానులతో సమావేశమైన డీసీపీ రష్మి పెరుమాళ్

ప్రతి దుకాణదారుడు బహిరంగ ప్రదేశంలో జీఐ షీట్లతో షెడ్డులను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక దుకాణానికి ఒక దుకాణం మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి ఒకదానికొకటి ఎదురుగా రెండు వరుసలు ఉండకూడదు. రద్దీ ప్రాంతాలకు, ట్రాఫిక్ సున్నితమైన మండలాలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా ప్రతి స్టాల్‌లో మాస్టర్ స్విచ్‌లతో స్థిర విద్యుత్ లైటింగ్ మాత్రమే అనుమతిస్తారు. అదేవిధంగా ఒక ఫైర్ ఇంజన్‌తో పాటు అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఈ స్టాళ్ల వద్ద ధూమపానం, వంటలు చేయకూడదు. బహిరంగ ప్రదేశంలో చేసే దుకాణదారులు పార్కింగ్ తప్పనీ సరిగా ఏర్పాటు చేసుకోవాలి.

ఎప్పటికప్పుడు తనిఖీలు

స్టాళ్ల వద్ద ఎప్పటికప్పుడు నార్త్ జోన్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూనే ఉంటారు. నిబంధనలు పాటించకుంటే లైసెన్స్ రద్దు చేస్తాం. మీ పటాకులు కొనుగోలు చేసుకునేందుకు వచ్చిన వారికి జాగ్రత్తలపై అవగాహన కల్పించండి.


ఆర్టీసీ ఈడీ మునిశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీ మహిళా నాయకులు హేమ, రమ్యాగౌడ్, సునీత తదితరులు

పెంచిన బస్ చార్జీలను తగ్గించాలి: హేమ

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకురాలు హేమ సుదర్శన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం బస్‌భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ఈడీ మునిశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఏపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు రమ్యాగౌడ్, సునీతలతో కలిసి వారు మాట్లాడారు. పెంచిన బస్ చార్జీలతో పేద ప్రజలు, విద్యార్థులపై అధిక భారం పడుతుందన్నారు.చార్జీలను తగ్గించకపోతే మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేసే వరకు పోరాడతామన్నారు.


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి గౌడ్

రాష్ట్ర బంద్‌కు ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యకు పిలుపు మేరకు ఈ నెల 14న జరిగే రాష్ట్ర వ్యాప్తం బీసీ బందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఓయూలో ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్లో ఇచ్చిన హామీ 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ జాప్యం చేయకుండా త్వరగా అన్ని రాజకీయ పార్టీలు కలిసి పరిష్కారాన్ని చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బొల్లేపల్లి స్వామి గౌడ్, ఎస్.నాగేశ్వరవు, డాక్టర్ లక్ష్మిగారి ఆంజనేయులు ముదిరాజ్, ఓయూ శంకర్, నిఖిల్, నరేష్, జూలూరి మహేష్, శ్రీకాంత్, సాయిలు, రజనీకాంత్, రాకేష్, శివ, శ్రవణ్, శ్రీధర్, నగేష్, రాజేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకారం అందిస్తాం

● మంత్రి కొండా సురేఖ

బౌద్ధనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస్‌నగర్‌లో శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని మంత్రి కొండా సురేఖ సందర్శించారు. ఆలయంలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను మంత్రి పర్యవేక్షించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి తమ శాఖ తరపున అన్నివిధాల సహాయ సహకారాలందిస్తామని తెలిపారు. దేవాదాయ స్థపతి వలినాయగం, ధార్మిక సలహాదారు గోవింద్‌హరిలు ఆలయ పునర్నిర్మాణ పనులను మంత్రికి వివరించారు. 24 నుంచి 31 వరకు నిర్వహించే మహా సంప్రోక్షణ అష్టబంధన మహా కుంభాభిషేకం కార్యక్రమానికి హాజరుకావాలని కమిటీ సభ్యులు ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ, రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు, డీసీ వినోద్, ఏసీ కృష్ణ, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేశ్‌కుమార్, అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీగిరిప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ తదితరులు

కనులపండువగా కల్యాణోత్సవం

బౌద్ధనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయచైర్మన్ నోముల ప్రకాశరావు ఇందిరా దంపతుల ఆధ్వర్యంలో శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య వేదపండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బిట్ల రఘునందన్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్, వేణు, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.


నామాలగుండు కల్యాణ వేంకటేశ్వస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం చేస్తున్న దృశ్యం

నేడు దసరా మిలాప్

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాంనగర్‌లోని ఎస్ఆర్‌టీ కమ్యూనిటీహాల్‌లో దసరా మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక మీడియా కన్వీనర్ గజ్జెల సూర్యనారాయణ తెలిపారు. శనివారం రాంనగర్‌లో దసరా మిలాప్ కార్యక్రమంపై ఆయన మాట్లాడారు. ప్రతియేటా దసరా మిలాప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని దళితులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిలాప్ కార్యక్రమ కన్వీనర్లు వివేక్, శ్యాంసుందర్, నవీన్, కృష్ణ, స్వామి, అరుణ, వెంకటేష్, భాస్కర్, రామస్వామి, పరిమళ్‌కుమార్, సదానంద్, నాయకులు గోపాల్ దాస్, సతీష్, నరేశ్, హరీశ్ పాల్గొన్నారు.

వినోభానగర్‌లో ప్రహరీ నిర్మాణం

ముషీరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ వినోభానగర్‌లో నాలా ప్రహరీ నిర్మాణ పనులను శనివారం జీహెచ్ఎంసీ అధికారులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాలా ప్రహరీ కూలిపోయిన విషయం తెలిసిందే. కూలిన ప్రహరీ దిమ్మెలను తొలగించి నిర్మాణ పనులను చేపట్టామని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని జీహెచ్ఎంసీ ఏఈ మురళీ తెలిపారు. నాలా నిర్మాణ పనులను బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ పరిశీలించారు. నాలా వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

మానసిక ఆరోగ్యం ముఖ్యం

● ప్రముఖ సైకలాజిస్టు రాజు ఆచార్య

మల్కాజిగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమని ప్రముఖ సైకలాజిస్టు రాజు ఆచార్య అన్నారు. ప్రపంచ మానసిక వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ సైకలాజిస్టు సొసైటీ తెలంగాణ ఆధ్వర్యంలో మల్కాజిగిరి నెస్ట్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజు ఆచార్య మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం, వాటి దుష్ఫలితాలపై ప్రజల్లో చైతన్యం పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆల్కహాల్, గుట్కా, సిగరేట్, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం ద్వారా శరీరంలో కలిగే అనారోగ్యకరమైన మార్పులు మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. సరైన కౌన్సెలింగ్, చికిత్సల ద్వారా మత్తుపదార్థాల వినియోగం అరికట్టవచ్చని అన్నారు. బాధితులు నిపుణులైన సైకలాజిస్టులను సంప్రదించి సహకారం తీసుకోవాలని సూచించారు. రిహాబిటేషన్ సెంటర్ ఫౌండర్ ఎంఎన్ఎమూర్తి, డైరెక్టర్ ప్రసూనలు మానసిక ఆరోగ్యం, వ్యసన విముక్తికోసం తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గురుమాధవ్, వాణి, రాంజీ, నేరేడ్‌మెట్ ఎస్ఐ రమేష్, తదితరులతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.


మానసిక వారోత్సవాల్లో పాల్గొన్న సైకలాజిస్టు రాజు ఆచార్య, తదితరులు



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | జి.అంజయ్య: 9985921364